**గుజరాతీ కథ -1912**



# వంశ గౌరవం

గుజరాతీ :
## కె.ఎమ్.మున్షీ

అనువాదం :
## ఘట్టమరాజు

ఋగ్వేది, ఆశ్వలాయనశాఖ, ఆత్రేయ గోత్రానికి చెందిన నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణుడు. ఆయన రోజూ త్రికాల సంధ్య వారుస్తూ 'ఆత్రేయస గోత్రోత్ప న్నోహం' అంటూ తన ప్రవర చెప్పుకొంటాడు.

ఈయన తాత ముత్తాతలు సతీ అనసూయ కడుపున పుట్టినవారే.

రుజువు చూపించమని మాత్రం అడక్కండి. మిట్టపల్లాల మీదుగా, ఆకులూ అలములూ, చెత్తాచెదారంతో నిండి ప్రవహించే నది ఏదో పర్వతం నుంచి పుట్టిందని మనం నమ్ముతామా, లేదా? అలాగే మహారాజ రాజశ్రీ సుమతీశంకర్ వంశవృక్షం పోగొట్టుకు పోయిందే గాని, ఆయన వంశానికి మూలపురుషుడు అత్రి మహాముని కాదనే దమ్ము లెవరికున్నాయి? అత్రి మహర్షి అంటే ఎవ రనుకొన్నారు? సాక్షాత్తు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ఒడిలో ఆడించిన మహానుభావుడు. అలాంటప్పుడు సుమతీశంకర్ వంశ గౌరవాన్ని తప్పుపట్టే ముందు రాజ్యం కోల్పోయిన చీనాసమ్రాట్టు వంశగౌరవం ఏపాటిది? సుమతీశంకర్ బాబాయి, మేనత్తలు అత్రి ముని గురించి చెప్పడం మీరు చెవులారా వినాలి, కళ్లారా చూడాలి. అప్పుడుగాని మీకు తెలియదు వాళ్ల

సమానత్వం గురించి అందరూ మాట్లాడే వారే! కాని తమదాకా వస్తే కులాభిమానం, వంశగౌరవం మరిచిపొయ్యే మహనీయులు మనలో ఎంతమంది ఉన్నారో చెప్పండి చూద్దాం. ఓవిధంగా చూస్తే ఇది తప్పే కాని, మరోవిధంగా చూస్తే వొప్పే అనాలి. ఎవరో మహానుభావుడు అన్నట్లు "మహాపురుషుల కిది మాయనిమచ్చ". అలాంటప్పుడు రాజశ్రీ సుమతీశంకర్ కుటుంబాని కో కళంకం ఉందంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఈరోజుల్లో తమ వంశం గురించి గొప్పలు చెప్పుకోనివా రెవరైనా ఉన్నారా? సుమతీశంకర్



బహుముఖీన ప్రతిభా సంపన్నులైన కె.ఎమ్. మున్షీ పేరు విననివా రుండరు. భారత దేశంలోని ప్రముఖ నగరాల్లోనూ, విదేశాల్లోని కొన్ని నగరాల్లోనూ 'భారతీయ విద్యా భవన్'లను స్థాపించి, భారతీయ సంస్కృతి వ్యాప్తికి దోహదం చేసిన మహనీయు డాయన. గుజరాతీలో కథలు, నవలలు, నాటకాలు, చరిత్రలు రాసిన డా॥ కె.ఎమ్. మున్షీ ఇంగ్లీషులో కూడా ఎన్నో రచనలు చేసిన దిగ్గజం.

కె.ఎమ్. మున్షీ రాసిన 'గౌమతి తాతయ్య గౌరవం' అనే కథ సుమారు 1912లో వెలువడింది. 'మారీ కమలా' (నా కమల) అనే కథాసంకలనం (1912) నుంచి ఈ కథను స్వీకరించడ మయింది. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అన్న సామెతకు ఈ కథ మంచి ఉదాహరణ.

వంశగౌరవ పరాక్రమాలు! అసలు అత్రి మహాముని, సతీ అనసూయలు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను లాలించేటప్పుడు సుమతీశంకర్ బాబాయి, మేనత్తలు తలుపుచాటునో, గోడవారనో నక్కివుండి విన్నారేమో, కన్నారేమో అని మీకే అనిపిస్తుంది. ఏవైనా శుభాశుభకార్యాలు జరిగినప్పుడు ఏడువక్కలు పెట్టి, సప్తర్షులను ఆవాహన చేసినప్పుడు చూడాలి సుమతీశంకర్ బాబాయి, విమతీశంకర్ ముఖం. ఆనందంతో చేటంతవుతుంది! ఛాతీ ఉప్పొంగిపోతుంది! అప్పుడాయన ఆనందపారవశ్యంతో అత్రి మహామునిగా భావించే వక్కపై నాలుగు చందనపు బొట్లు ఎక్కువగా విదిలించకుండా, నాలుగు పూరేకులు అధికంగా వేయకుండా ఉండలేడు. ధీరమతి అత్తవైపు చూస్తూ అత్రి మహర్షిని ఆవాహన చేసిన వక్కవైపు చూపుడు వేలుతో చూపిస్తూ ... అదిగో ! ఆ మహానుభావుడే మా తాత అన్నంత ధీమాగా కనుబొమలు ఎగురవేస్తాడు.

సుమతీశంకర్ ఇంతగా మిడిసి పడటానికి మరోకారణం లేకపోలేదు.

అతనుకాని, అతని కుటుంబ సభ్యులుకాని ఇతరులు వినీ వినపడకుండా మాట్లాడుకొంటారు. లేదా పరస్పరం సైగలతో అర్థం చేసుకొంటారు. ఆ వంశంలోని ప్రతి మనిషి పేరులోనూ 'మతి' శబ్దం ఉండేది. బహుశా వాళ్లకెవరికీ నిజంగా మతి ఉండేది కాదేమో! సుమతి బాబాయి పేరు విమతి, మేనత్త ధీరమతి, నాన్న శంకరమతి, ఇలాగే అందరూ 'మతి'కలవారే! వాళ్ల పూర్వీకుల్లో ఒకరైన గౌమతి గొప్ప పరాక్రమశాలి అట! అందుకే వాళ్ల వంశం మిగతా వాళ్లకంటే విలక్షణంగా, విశిష్టంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇలాంటిపేర్లు పెట్టుకొన్నారు. వాళ్ల బాబాయి కులస్థుల పెళ్లిళ్లలో కానివ్వండి, చావుల్లో కానివ్వండి అందరికంటే ముందుండేవాడు. వాళ్లమేనత్తలు బంధువు లెవరింట్లో అయినా చావు సంభవిస్తే అందరికంటే భిన్నంగా ఏడ్చేవారు, గుండెలు బాదుకొనేవారు. వాళ్ల పిల్లలు ఇరుగు పొరుగు పిల్లలతో కలిసిమెలిసి తిరిగేవారు కారు. 'మా పిల్లలు ఇతరుల పిల్లలతో కలిసి కూర్చున్నారో, మాట్లాడారో, తిరిగారో... జాగ్రత్త! మీ భరతం పడ్తా' అని పంతుళ్లను హెచ్చరించేవారు. గౌమతి వంశంలో జన్మించడమంటే మాటలామరి! వాళ్ల కుటుంబాలవా ళ్లెవరికీ నేలమీద కాళ్లు నిలిచేవి కావు.


చిన్నప్పుడు సుమతికి ముక్కుమీద కోప ముండేది. అయినా గౌమతి వంశంలో పుట్టిన వాళ్లకుండాల్సిన దానికంటే తక్కువ మోతాదులోనే ఉండేదని చెప్పాలి. వీధిలోని పిల్లలతో ఎందుకు ఆడుకోకూడదో, క్లాసులో సాటి పిల్లల ప్రక్కన ఎందుకు కూర్చోకూడదో అతనికి తల బద్దలు కొట్టుకున్నా అర్థమయ్యేదికాదు. తోటి పిల్లలతో కలిసి చిరుతిళ్లు తినడం కాని, పరుగెత్తడం కాని కూడదని కట్టుదిట్టం ఎందుకు చేశారో బోధపడేది కాదు. ఎప్పుడైనా సుమతి సాటిపిల్లలతో ఆడినట్లు తెలిస్తే, మేనత్తలైన ధీరమతి, హరమతి గట్టిగా చీవాట్లు పెట్టేవారు. 'గౌమతి వంశంలో చెడబుట్టినావు కదరా' అని చెవులు పిండేవారు.


మేనత్త లిద్దరిలో హరమతికి వంశగౌరవమంటే గోరోజనం కాసింత ఎక్కువనే చెప్పాలి. భర్తతో ఏడేళ్లు కాపురం చేసిందికాని, తన పుట్టింటి గౌరవం గురించి మొగుడితో అత్తగారితో రోజూ కొట్లాడేది. గౌమతి వంశ గౌరవం అత్తగారింటి వాళ్ల తల కెక్కక పొయ్యేసరికి వాళ్లతో తెగతెంపులు చేసుకొని పుట్టింటి కొచ్చేసింది. భర్తఉండి కూడా విధవరాల్లా రోజులు నెట్టుకు రాసాగింది.

'అత్తయ్యా! ఇలా ఎందుకు చెయ్యకూడదు?' అని సుమతి అమాయకంగా అడిగేవాడు. దాన్తో ఇద్దరు మేనత్తలు అగ్గిమీద గుగ్గిలం అయ్యేవారు. 'దేవుడా! ఈ వెర్రిబాగుల వాణ్ణి ఎలాగైనా కాపాడు' అని భగవంతునికి మొర పెట్టుకునేవారు. కళ్లెర్రచేసి దేవుడిగది వైపు చూడమనేవారు. దీని వెనకాల కథ.... ఓ పెద్దకథ ఉంది.

దేవుడి గదిలో ఓ బ్రహ్మాండమైన రహస్యముంది. గౌమతి పేరు చెవుల్లో పడగానే అందరి చూపులు అటు మళ్లేవి. గౌమతి తాతయ్య అక్కడ బొందితో అవతరించాడన్న నమ్మకం కలిగేది. ప్రతి సంవత్సరం వైశాఖ చతుర్దశినాడు కుటుంబ సభ్యులందరు ఒక్కచోట చేరేవారు. పిల్లలందరినీ ఓ గదిలో పెట్టి గొళ్లెం పెట్టేవారు. దేవుడిగదిలో నేతి దీపాలు వెలిగించి మూటకు నైవేద్యం సమర్పించేవారు.

ఆ గంటులో ఏముందో తెలుసుకోవాలని సుమతి తహతహలాడేవాడు. కాని బాబాయి అందుకు పిసరంత కూడా అవకాశం కల్పించేవాడు కాదు. అతను పెద్దవాడయిన తర్వాత చెప్పారు - "ఆ మూటలో గౌమతి తాతయ్య కిరీటం, చీని చీనాంబరాలు, రత్నాభరణాలు ఉన్నాయి." ఆ మూటలో అవి భద్రంగా ఉన్నంతవరకు ఈ కుటుంబం చల్లగా ఉంటుందని ఓ వదంతి ప్రచారంలో ఉండేది. వంశీకు లందరూ ఈ దంత కథను నమ్మేవారు. గౌమతి వంశ గౌరవానికి సంకేతంగా నిలిచేవాడు. ఆయనకు పూజా పునస్కారాలు జరిగేవి. బ్రాహ్మణులకు భూరి దక్షిణలు లభించేవి. 22 ఏళ్ల దాటగానే గౌమతి తాతయ్య వస్త్రా లంకారాలను చూసే భాగ్యం కలుగుతుందని నచ్చచెప్పారు.






కాలం గడిచేకొద్దీ, సుమతికి తాను వంశోద్ధారకుడనే నమ్మకం ఎక్కువ కాసాగింది. అతనికి వంశప్రతిష్ఠ గురించి అహమూ అతిశయించ సాగింది. 22 ఏళ్లవరకు దేవుడిగదిలోకి వెళ్లకూడదని నిషేధం. అతను కల్పనాలోకంలో విహరించసాగాడు. ఫళఫళమనే పట్టు పీతాంబరాలు, ధగధగా మెరిసే వజ్ర ఖచితాభరణాలు, తళతళా మెరిసే తలపాగా, మిలమిలా మెరిసే మణిహారాలు... లోపల ఇంకా ఏమేమి దాగున్నాయో! ఖచ్చితంగా విక్రమార్కుని కంటే గొప్పవాడే అయుండాలి. ఇంగ్లీషు పుస్తకాలు చదవడం మొదలుపెట్టాడు. రూపాయి వెలగల మెట్రిక్ పాఠ్యపుస్తకాల్లోని ప్రతి లైనులోనూ ఎక్కడైనా గౌమతిపేరు కనపడుతుందేమో అని గాలించడం మొదలుపెట్టారు. మెట్రిక్ క్లాసులోనికి వచ్చిన తర్వాత కూడా ఈ వేట సమాప్తం కాలేదు. రూపాయి పుస్తకాలు సమగ్ర చరిత్రలు కావన్న నమ్మకం కలిగింది. స్కూలు గ్రంథాలయం నుంచి మిల్ రాసిన చరిత్ర తీసుకొచ్చి అన్వేషించడం మొదలెట్టాడు.

ఓ బ్రాహ్మణుని తప్పుడు సలహా ప్రకారం సుమతిని కాలేజిలో చేర్పించారు. హాస్టలులో చేర్పిస్తే కులభ్రష్టుడై పోతాడన్న భయంతో ఓ సత్ బ్రాహ్మణుని ఇంట్లో అన్నపానాలు ఏర్పాటు చేశారు. పైగా ఆత్మారాముడి సేవంటూ ఒకటుందిగా! అంతూ, మ్లేచ్ఛవిద్య నేర్చుకోవడం మొదలెట్టాడు.

అశుద్ధమైన ఇంగ్లీషు చదువు సుమతి పవిత్రమైన గౌమతీ స్వభావాన్ని కలుషితం చేసింది. మెల్లమెల్లగా 'స్వాతంత్ర్యం', 'వ్యక్తిత్వం' మొదలైన లావాలాంటి పాశ్చాత్య పదాలు అతని చెవుల్లో గింగురు మనసాగాయి. అతను క్రమక్రమంగా గంగలా కిందికి దిగజార సాగుతూ ఆంతరంగిక విషయం... ఓసారి వరుసగా మూడురోజుల పాటు సంధ్యకూడా వార్చలేదు.

మరోసారి కాలేజి వక్తృత్వ పోటీల్లో 'మానవులందరూ సమానులే' అన్న విషయంపై సిగ్గులేకుండా వాదించాడు. అన్నింటికంటే ఘోరమైన విషయ మేమిటంటే - తాత ముత్తాతల పేరు చెప్పుకొని బతకటం కంటే హీనమైన పని మరొకటి లేదని ఘంటాపథంగా ఘోషించడం. ఇది పతనానికి పరమావధి కాదంటారా? స్వర్గంలోనో, లేదా ఎక్కడుందో కాని గౌమతి ఆత్మ మటుకు విలవిలలాడింది. బ్రహ్మలోకంలోని అత్రి మహాముని చేతిలోంచి కమండలం జారి కిందపడింది. ఆయన అర్ధాంగిని అనసూయ కళ్లలోంచి ఆధ్మాత్మిక అశ్రువులు జలజలా రాలసాగాయి.

బుద్ధిభ్రష్టు పట్టేకొద్దీ దేవుడిగది లోని చిదంబర రహస్యాన్ని ఛేదించాలన్న కాంక్ష బలపడసాగింది. 'గౌమతి తాతయ్య పుట్టు పూర్వోత్తరాల గురించి జిజ్ఞాస నానాటికీ అధికం కాసాగింది. గౌమతి పేరు రాజుల - మహారాజుల జాబితాలో కనబడక పోయేసరికి అతను ఏ జమీందారో, ఠాకూరో అయివుంటా డనిపించింది. 20-22 ఏళ్ల మధ్యకాలంలోని అవధిని దాటడం ఎంత కష్టమని!

ఎట్టకేలకు 22 ఏళ్లు గడువుదాటే సమయం ఆసన్నమయింది. బాబాయి దాటుకొన్నాడు. దేవుడి గదిలోని మూట విప్పి చూసేందుకు మేనత్తలు అంగీకారం తెలిపారు. సుమతిశంకర్ ఎగిరి గంతులేశాడు. ఓ మంచి రోజున అతను ఊరొచ్చాడు. కోడళ్లు పుట్టిళ్లకు పొయ్యారు. పిల్లలను పొరుగిళ్లకు పంపారు. తలుపులు బిడాయించారు. మేనత్తలు, మేనల్లుడు గౌమతి తాత వస్త్రభూషణాలను దర్శించే నిమిత్తం దేవుడి గదిలోకి ఎంతో జాగ్రత్తగా కాలుపెట్టారు. గట్టిగా నిట్టూర్చారు. భయభక్తులు, కృతజ్ఞతలు పొంగిపొర్లాయి. మనసుల్లోనే అత్రి, అనసూయలను ధ్యానించుకొన్నారు. దేవుడి గదిలో గౌమతి తాతయ్య ఎక్కడ నిద్ర లేస్తాడో అన్నంత భయంతో మెలమెల్లగా ముగ్గురూ అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్లారు. ఓ మేనత్త చేతుల్లో నేతి దీపాలు, మరో మేనత్త చేతుల్లో నైవేద్యం పట్టుకొన్నారు. దేవుడి గదిలో బొద్దింకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఓ చీకటి మూల లోంచి ఓ మేనత్త వణుకుతున్న చేతుల్తో ఓ చిన్నపెట్టెను బయటికి తీసింది.

సుమతి చెవుల్లో భేరీవాద్యాలు మోగుతున్నాయి. ఇరవైరెండేళ్ల తపస్సు ఫలించే ముహూర్తం సమీపించింది. చేతులు వణుకుతున్నాయి. గొంతు ఎండిపోతూంది. ఆ పెట్టెకే వేలాడుతున్న తుప్పుపట్టిన చెవితో తాళం తీశాడు. మేనత్త లిద్దరూ కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో అల్మారాను చూపిస్తున్నట్లు కళ్లింతలు చేసుకొని సుమతివైపు చూస్తున్నారు. చీకట్లో సుమతి పెట్టెలోకి తొంగిచూశాడు. ఆకుపచ్చ ముఖమల్ దుస్తులు, కొన్ని వెండి బిళ్లలు కనపడ్డాయి. పట్టుపీతాంబరాలు, శిరోభూషణాలు వగైరా హుళక్కి! వెండిబిళ్లపై ఏదో చెక్కినట్లు తోచింది. కాస్త వంగి ఆ అక్షరాలను చదవాలని ప్రయత్నించాడు. ఇంగ్లీషు అక్షరాల్లో 'సూరత్' అన్న పదం అగుపడింది.

'ధీరమతి అత్తా! ఈ వెండిబిళ్లను పైకి తియ్యాలి. దీనిమీద ఏదో రాసినట్లుంది.'

'వద్దు! వద్దు! దాన్ని బయటికి తియ్యొద్దు!'

'అలా ఉంటే కుదర్దు. గౌమతి తాతయ్య గురించి మనం తెలుసుకోవద్దా? ఇంగ్లీషు చదువంటే ఏమనుకొన్నావ్?'

మేనత్త లిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొంటూ, విధిలేక 'అలాగే' అన్నారు.

సుమతి తలలో రకరకాల ఆలోచనలు గిరికీలు కొడుతున్నాయి. బహుశా గౌమతి తాతయ్య సూరత్‌కు దివానుగా పనిచేశాడేమో! తెల్లదొరలు సూరత్‌ను ఆయనకు జాగీరుగా ఇచ్చారేమో! కోర్టు కెక్కితే సూరత్‌ను మళ్లీ రాబట్టుకోవచ్చు. ఇంగ్లాండుదాకా అయినాసరే వెళ్లి రాబట్టుకోవాల్సిందే! మన హక్కును మనం ఎందుకు వదులు కోవాలి? ఇలా ఆలోచిస్తూ అతను పెట్టెను చీకటి గుయ్యారం నుంచి వెలుతురులోనికి తెచ్చాడు. 'సూరత్'పేరు ఎక్కడ జారిపోతుందో అన్న భయంతో ఎంతో జాగ్రత్తగా కోటును రెండు చేతుల్తో బయటికి తీశాడు. కోటుమీద వెండి అక్షరాలు కనపడ్డాయి. వెల్తురులో అక్షరాలు కూడబలుక్కొని చదివాడు. సుమతికి కళ్లు బైర్లు కమ్మాయి. - "సూరత్ పాలెస్. మిస్టర్ హావర్డు నౌకరు".

సుమతికి మూర్ఛ వచ్చినంత పనయింది. అతని చేతుల్లోంచి కోటు జారి కింద పడింది. గౌమతి తాతయ్య ఏం ఉద్యోగం వెలగబెట్టాడో తెల్సిపోయింది. స్పృహరాగానే అతను పెంకులదిరేలా నవ్వాడు. మేనత్తలకు కోపం వచ్చింది. అతను వాళ్లకు కథంతా వివరంగా చెప్పాడు. వాళ్లు తమ కులాభిమానాన్నీ, వంశగౌరవాన్నీ అదిమిపెట్టుకో గలిగారు.

రాత్రి మేనత్తలు, మేనల్లుడు పెరటి తలుపునుంచి బయటికి వచ్చారు. ఓ మూటకు పెద్దరాయి కట్టి, పొరుగు కాంపౌండులోని బావిలో గౌమతి తాతయ్య వంశగౌరవాన్ని విసర్జించారు. ●